క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మిరుదొడ్డి(దుబ్బాక): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సంస్థ ద్వారా 2025–26 విద్యా సంవత్సరానికి 5 నుంచి 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ చేయనున్నారు. ఆ మేరకు అర్హత ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు అల్వాల గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ రఘునందన్ రావు సోమవారం తెలిపారు. 2024–25లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులని పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇదే నెల 23 ఉదయం11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎంపిక చేసిన కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

పారదర్శకంగా సేవలు



అంగన్‌వాడీ టీచర్లుకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ రమాదేవి

మద్దూరు(హుస్నాబాద్): పోషణ్ ట్రాకర్ ద్వారా అంగన్‌వాడీల్లో పారదర్శకంగా సేవలు అందించేందుకు వీలు ఉంటుందని సీడీపీఓ రమాదేవి అన్నారు. పోషణ్ ట్రాకర్ యాప్‌పై మద్దూరు, దూల్మిట్ట మండలాల్లోని అంగన్‌వాడీ టీచర్లుకు ఆమె అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రం యొక్క రోజూ వారీ సమాచారాన్ని యాప్‌లో ఎలా అప్‌లోడ్ చేయాలో తెలిపారు. ఇందులో లబ్ధిదారుల ఫొటోలను నిక్షిప్తంగా చేయాలన్నారు. దీంతో మెరుగైన సేవలు అందించేందుకు వీలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు పుష్పాలత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

తాళ్లకుంట చెరువును పరిరక్షించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న అయినాపూర్ మాజీ సర్పంచ్ రమణారెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ గ్రామంలో తాళ్లకుంట చెరువును కాపాడాలని మాజీ సర్పంచ్ చెరుకురమణారెడ్డి కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ మనుచౌదరికి వినతి అందజేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే చెరువుకు హద్దులు ఏర్పాటు చేయాలని ఏడీ సర్వేయర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు రమణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

కనీస వేతనాలు అమలు చేయాల్సిందే



ఏసీఎల్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న సెక్యూరిటీ గార్డ్స్

దుబ్బాక: సోలార్ పవర్ ప్లాంట్లలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్, ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ అన్నారు. సోమవారం అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీనివాస్(ఏసీఎల్)కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. దుబ్బాక మండలం రాజక్కపేట శివారులో క్లీన్ సోలార్ పవర్ చిత్రదుర్గ ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్ ఏడు సంవత్సరాలుగా శ్రమదోపిడీకి గురవుతున్నాయని విమర్శించారు. అగ్రిమెంట్ జూలైలో ముగిసినా సరస్వతీ సేఫ్ హ్యాండ్స్ ఏజెన్సీ వారు తిరిగి అగ్రిమెంట్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా నెలకు రూ. 26 వేల వేతనాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్, బాబు, మహేశ్ ఉన్నారు.

కార్యదర్శిగా బ్రహ్మం ఏకగ్రీవం



బాలబ్రహ్మంను సన్మానిస్తున్న నాయకులు

కొండపాక(గజ్వేల్): తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం కార్యదర్శిగా కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బాలబ్రహ్మం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కుకునూరుపల్లిలోని సంఘం కార్యాలయంలో ఆయన్ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా బ్రహ్మం మాట్లాడుతూ దేవాలయాల్లో విశ్వకర్మలకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేస్తామన్నారు. నాయకులు నర్సింహాచారి, సుదర్శనచారి, లక్ష్మణచారి, ఆంజనేయులు, సంతోష్‌చారి పాల్గొన్నారు.

ఆందోళన



రెగ్యులరైజ్ చేసి పేస్కేల్ చెల్లించాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 21వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సమ్మెపై స్పందించకపోవడం దారుణమని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లోనే సమస్య పరిష్కరిస్తానని పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

– సిద్దిపేటరూరల్

ఆవేదన



వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, సంక్షేమ పథకాలను అమలు చేయాలని, 55 ఏళ్లు నిండిన ప్రతీహమాలీకి నెలకు రూ. 10వేల పెన్షన్ ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట హమాలీలు ధర్నా నిర్వహించారు. అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున త్వరితగతిన వాటిని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

– సిద్దిపేటరూరల్

పదోన్నతితో బాధ్యతలు పెంపు

సిద్దిపేటకమాన్: పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐలు పదోన్నతి పొందిన ఎండీ అలీ, ఏ ముత్యం, వీ మధుసూదన్, యస్ తిరుమలబాబులను తన కార్యాలయంలో ఆమె సోమవారం అభినందించారు. పదోన్నతులు పొందిన పోలీసు సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలందించాలని అన్నారు. క్రమశిక్షణతో, బాధ్యతగా విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించే ప్రతిఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్‌గౌడ్, కిరణ్, రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, పీఆర్‌ఓ మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొద్దుతిరుగుడుకు కేరాఫ్ అడ్రస్

కట్కూర్



కట్కూర్‌లో సాగు చేసిన పొద్దుతిరుగుడు

కుందనవానిపల్లి, రామవరం, పోతారం(జే).. గ్రామాల్లోను చేపట్టిన రైతులు

అక్కన్నపేట మండలం రైతులు పొద్దు తిరుగుడు సాగు వైపు మొగ్గుచూపుతున్నారు. అందులోనూ కట్కూర్ గ్రామం కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఏర్పడటం కూడా కారణం. రబీ సీజన్‌లో సాగు చేసిన ఈ పంట స్వల్పవ్యవధిలోనే చేతికి రానుంది. తక్కువ పెట్టుబడి.. లాభాలు ఎక్కువ పొందొచ్చని ఉద్దేశంతో సాగు చేపట్టారు. వ్యవసాయాధికారులు కూడా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

- 90 రోజుల్లోనే పంట చేతికి
- క్వింటాలు ధర రూ.7,280పైనే

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామం పొద్దు తిరుగుడు పంటకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. 205 ఎకరాల్లో సాగవుతోంది. కుందనవానిపల్లి, రామవరం, పోతారం(జే), మంచినీళ్లబండ, కేశవాపూర్, మల్లంపల్లి, అంతక్కపేట, పంతుల్‌తండా,ధర్మారం, రేగొండ గ్రామాలతో పాటు పలు గ్రామాల రైతులు ఈ పంటతోపాటు ఇతర పంటల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. మండల వ్యాప్తంగా ఈ రబీ సీజన్‌లో సుమారుగా 469ఎకరాల్లో పొద్దు తిరుగుడు పంటను సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పంట 90రోజుల్లోనే చేతికి వస్తున్నది. అంతర పంటగా కూడా విత్తుకుంటున్నారు. ఎకరానికి దాదాపుగా రూ.10వేల ఖర్చు కాగా, పంట స్వల్పకాల వ్యవధి 90 రోజులకే పంట చేతికి వస్తోంది. ఈ పంటకు మార్కెట్‌లోనూ డిమాండ్ పెరిగింది. మద్దతు ధర క్వింటాలుకు రూ.7,280వేల పైనే పలకనున్నది. తక్కువ పెట్టుబడితో రూ.లక్షల్లో దిగుబడి వస్తున్నది. ఏటా సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని సైతం ఈ గ్రామంలో ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం వ్యవసాయ అధికారులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని అవగాహన కల్పిస్తున్నారు.

సూర్యుడి మీద ప్రేమతో...

సూర్యుడి పోలికలతో మెరిసే అందమైన ఈ పువ్వును సూర్యకాంత పుష్పమని అని పిలుస్తారు. పొద్దుఎటు తిరిగితే అటు తిరగడం వల్ల దీనికి పొద్దు తిరుగుడు పువ్వనే పేరొచ్చింది.

స్వల్పకాలంలోనే పంట చేతికి



స్వల్పకాలంలోనే పొద్దుతిరుగుడు పంట 90 రోజుల వరకు చేతికి వస్తుంది. గతంలో కట్కూర్‌లో అధికంగా పండించే వారు. ప్రస్తుతం చాలాగ్రామాల్లో పొద్దు తిరుగుడు పంట సాగుచేస్తున్నారు. ఖర్చు తక్కువ దిగుబడి ఎక్కువ. ఈ సారి పొద్దు తిరుగుడు పంటకు డిమాండ్ బాగానే ఉంటుంది.

– కరంటోతు శ్రీలత, ఏఈఓ రామవరం క్లస్టర్

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

జేహెచ్‌ఆర్ మదర్సా చైర్మన్ హైదర్ పటేల్

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జేహెచ్‌ఆర్ మదర్సా చైర్మన్ ఎంఎస్‌కే హైదర్ పటేల్ సూచించారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్‌లో గల మదర్సాలో సోమవారం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటూ విద్యార్థులు చదువుల్లో రాణించడంతో పాటు ఎంచుకున్న లక్ష్యం దిశగా ముందుకు సాగాలన్నారు. ఉన్నత స్థానాల్లో నిలిచినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు మహ్మద్ జహీర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదాం షేక్, సూపరింటెండెంట్ మహమ్మద్ జస్మద్దీన్, ఉపాధ్యాయులు అన్వర్, అన్వర్ హుస్సేన్, ముక్తార్ అలాం, బుష్రాయాస్మీన్, శ్వేత, కవిత, రాజేశ్వరి, ఫహీమ్దా, ఆలియా తబస్సుమ్, ఆఫ్రిన్, బుష్రా అంజుమ్, తనస్, ఆయేషా, సిబ్బంది మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మదర్సా చైర్మన్ హైదర్‌పటేల్, ఉపాధ్యాయులు

విద్యార్థి దశలో క్రమశిక్షణే కీలకం

టూటౌన్ సీఐ ఉపేందర్



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): షీటీం అవగాహన కార్యక్రమ ఫ్లెక్సీతో సీఐ ఉపేందర్, విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థి దశలో క్రమశిక్షణకు ప్రాముఖ్యత కల్గి ఉంటుందని, అందువల్ల అందరూ క్రమశిక్షణతో ఉండాలని టూటౌన్ సీఐ ఉపేందర్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సహస్ర పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, షీటీమ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, ర్యాగింగ్, మహిళా చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతీ పాఠశాలలో ఫిర్యాదు బాక్స్ ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థినులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై చీటీ రాసి అందులో రాసి వేయాలన్నారు. సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ సమయాన్ని కేవలం చదువుపై మాత్రమే కేంద్రీకరించుకోవాలన్నారు. విలువైన సమయాన్ని వృథా చేసుకోరాదన్నారు. విద్యార్థి దశలో మత్తు, గంజాయి, మద్య, ధూమపానం అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్‌ను పరిమితంగా వినియోగించాలన్నారు. ఒకవేళ ఈవ్‌టీజింగ్ ఎదుర్కొంటే డయల్ 100, పోలీస్ కమిషనరేట్, షీటీమ్ నంబర్ 87126–67434 నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శాంతి కిరణ్, ఉపాధ్యాయులు, షీటీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

గజ్వేల్‌రూరల్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపలిటీ పరిధిలో ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 25 మంది వాహనదారులను ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ఎదుట హాజరుపర్చామన్నారు. విచారణ అనంతరం ఒక్కొక్కరికీ జరిమానా విధించడంతో పాటు వారిలో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపవద్దని, రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేతలు అడ్డగింత



స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం రామునిపల్లి గ్రామ చెర్వు శిఖం భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను కూల్చివేసే పనులను సోమవారం స్థానికులు అడ్డుకున్నారు. కొందరు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఇరిగేషన్ శాఖ అధికారి శ్రీనివాస్‌తో పాటు ఆర్ఐ సత్యనారాయణలు జేసీబీతో వెళ్లారు. నిర్మాణాలకు అనుమతులు చూపాలని అడుగగా అధికారులతో వాగ్వాదానికి దిగారు. కూల్చివేతలను అడ్డుకున్నారు. ఈ విషయాన్ని ఆర్ఐ పోలీసులకు సమాచారం అందించగా హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని నచ్చజెప్పారు. అనుమతుల కోసం కొంత సమయం ఇవ్వాలని, అప్పటివరకు నిర్మాణాలు చేపట్టబోమని నిర్వాహకులు కోరడంతో వెనుదిరిగారు. కార్యక్రమంలో నిర్వాహకులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పట్టణంలోని లక్ష్మీప్రసన్నకాలనీ శివారులో ఉన్న పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడులు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,610 నగదుతో పాటు 3 సెల్‌ఫోన్లు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మరో ఐదుగురు పారిపోయారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. గ్రామాలు, పట్టణాలు, ఫామ్ హౌజ్‌లు, బహిరంగ ప్రదేశాల్లో పేకాట, చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ 87126–67445, 87126–67446, 87126–67447 నంబర్లలో సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

బాలిక విద్యతోనే సమాజ మార్పు : ఎంఈఓ

దుబ్బాకటౌన్: బాలికల చదువుతోనే సమసమాజ మార్పు సాధ్యమని రాయపోల్ మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి, క్రై స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జెర్ర ప్రతాప్, అన్నారు. సోమవారం రాయపోల్ మండల కేంద్రం కేజీబీవీ పాఠశాలలో బాలల పరిరక్షణ, హక్కులు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం సమాజంలో చిన్నారులు, మహిళలపై అనేక అరాచకాలు, అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. వాటి నివారణ కోసం ప్రజలందరూ చైతన్యవంతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాజ్యాంగ హక్కులు పొందే అధికారం బాలలకు ఉన్నాయన్నారు. బాలల పరిరక్షణ అధికారి రాజు, సభ్యులు నర్సింహులు, కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌ఓ శ్రీలత, కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఘనంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావం

చేర్యాల(సిద్దిపేట): ఎస్.ఎఫ్.ఐ ఆవిర్భావ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. చేర్యాల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రంజిత్‌రెడ్డి మాట్లాడారు. నాడు కేరళలో ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భవించిదన్నారు. విద్యార్థుల సమస్యలే లక్ష్యంగా పని చేస్తూ ఎన్నో విజయాలను సాధించిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యరంగానికి అధిక నిధులు కేటాయించాలని, విద్యాసంస్థలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేర్యాల డివిజన్ కార్యదర్శి తాడురి భరత్, తాడూరి విక్రం, గొర్రె మహేశ్, అనిల్, ప్రశాంత్, రవీందర్, అకిల్ తదితరులు పాల్గొన్నారు.

◆ అందరూ కలిసిమెలిసి జీవించాలి



చిన్నకోడూరు(సిద్దిపేట): గ్రామాల్లో కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని రామునిపట్లలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుల వివక్ష పాటిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేవాలయాల్లోకి అందరికీ ప్రవేశం ఉందన్నారు. రెండు గ్లాసుల విధానం పాటిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మల్లికార్జున్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కవిత, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

◆ పౌర హక్కులపై అవగాహన అవసరం

అక్కన్నపేట(హుస్నాబాద్): రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్ఐ జాహిద్ అన్నారు. అక్కన్నపేట మండలం రామవరంలో సోమవారం పౌర హక్కు దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ కృష్ణా నాయక్, పంచాయతీ కార్యదర్శి రాము, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

◆ కులం పేరుతో దూషిస్తే చర్యలు

మద్దూరు(హుస్నాబాద్): గ్రామంలో ఎవరైనా సరే కూలం పేరుతో దూషిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఎస్ఐ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని వల్లంపట్ల గ్రామంలో ఆర్ఐ రమేశ్‌తో కలిసి ఆయన పౌర హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కులాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఉపాధ్యాయ బకాయి బిల్లులు చెల్లించాలి


మర్కూక్(గజ్వేల్): ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేయాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్‌శర్మ, ఎంఈఓ వెంకటరాములు తెలిపారు. సోమవారం మండలంలోని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంఘం బలోపేతం కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ప్రతిభ, ఉపాధ్యాయులు కుచిరెడ్డి, నర్సింహులు, వెంకట నర్సింహారెడ్డి, రవీందర్ నాయక్ పాల్గొన్నారు.

◆ ప్రత్యేక పూజలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిళ్లాపూర్‌లో గల శివాలయంలో మార్గశిర అమావాస్య సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృత అభిషేకం, బిల్వార్చన చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి వెంకటేశం, భక్తులు పాల్గొన్నారు.

◆ అబాకస్‌లో 'శ్రీఆదర్శ' ప్రతిభ

కోహెడ(హుస్నాబాద్): అబాకస్‌లో శ్రీఆదర్శ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాఠశాల కరస్పాండెంట్ యశోద అంజయ్య తెలిపారు. ఇటీవల కరీంనగర్ జిల్లా కేంద్రంలో అబాకస్ కాంపిటీటివ్ సంస్థ ఆధ్వర్యంలో జోనల్ స్థాయిలో పరీక్ష నిర్వహించారు. పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఇందులో జూనియర్ విభాగంలో నీల ప్రవీణ ప్రతిభ కనబర్చారు. రాష్ట్ర స్థాయికి అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. మిగతా వారు సత్తాచాటారని తెలిపారు. ప్రిన్సిపాల్ యశోద శైలజ, ఉపాధ్యాయుల విద్యార్థినిని అభినందించారు.



సస్యరక్షణతోనే నారుమడుల సంరక్షణ



నారుమడులను పరిశీలిస్తున్న ఏఓ నరేశ్

దుబ్బాకటౌన్: చలి తీవ్రత నుంచి నారుమడులను రక్షించుకునేందుకు రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి నరేశ్ అన్నారు. సోమవారం రాయపోల్ మండలం లింగారెడ్డిపల్లి, అనాజీపూర్ గ్రామలలో వరి నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలి తీవ్రత వల్ల నారుమడులు ఎరుపుగా మారటం, ఎదుగుదల సరిగ్గా లేకపోవటం వంటివి కనిపించే అవకాశం ఉందన్నారు. రైతులు నారును చలి నుంచి కాపాడుకోవడానికి రాత్రి పూట నీళ్ల తీసి ఉదయం వేడి నీరు పెట్టటం ద్వారా నారు మడిని కాపాడుకోవచ్చన్నారు. తెగుళ్ల నివారణ చర్యల గురించి తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రవీణ్, రైతులు తదితరులున్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల సత్తా

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల స్థాయి సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. 10 పాఠశాలల నుంచి ముగ్గురు చొప్పున 30 మంది విద్యార్థులు హాజరయ్యారు. గౌరవెల్లి, కట్కూర్, అంతక్కపేట, అక్కన్నపేట, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానోతు జయరాం, ఎంఈఓ గుగులోతు రంగానాయక్, ఉపాధ్యాయులు శంకర్ నాయక్, జంగపల్లి వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

దుబ్బాక రూరల్‌లో..

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలంలో విద్యార్థులకు సాంఘికశాస్త్ర టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. రామేశ్వరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఇందులో మొదటి స్థానంలో రేవతి, రెండవ స్థానంలో పల్లె ఎంజెల్ నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నీలం శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

సిద్దిపేటరూరల్‌లో..

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండల స్థాయిలో నిర్వహించిన సోషల్ టాలెంట్ టెస్టులో జక్కాపూర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు మొదటి మూడు ర్యాంకులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు షౌకత్‌అలీ సోమవారం తెలిపారు.



అక్కన్నపేట(హుస్నాబాద్): టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాఠశాల విద్యార్థులు కె.లికిత్, డి.సంజన, వై.అనూష వరసగా ఒకటి, రెండవ, మూడవ ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల సోషల్ ఉపాధ్యాయులు పద్మ, రాజులను అభినందించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

మద్దూరు(హుస్నాబాద్): విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకునేందుకు యత్నించాలని ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి అన్నారు. సోమవారం దూల్మిట్ట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలల్లో తెలంగాణ సాంఘిక శాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఇలాంటి పోటీ పరీక్షల్లో పాల్గొంటే విద్యార్థుల ప్రతిభ బయటపడుతుందన్నారు. రాబోయే పదవ తరగతి పరీక్షల్లో మంచి విజయం సాధించాలన్నారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దుబ్బాక: ప్రతిభ కనబర్చిన విద్యార్థికి జ్ఞాపిక అందిస్తున్న ఎంఈఓ ప్రభుదాసు

దుబ్బాకలో...

దుబ్బాక: ప్రభుత్వ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు సోమవారం సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. టీఎస్ఎస్‌టీఎఫ్ ఆధ్వర్యంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సౌజన్యంతో దుబ్బాక జెడ్పీజీహెచ్ఎస్‌లో జరిగిన కార్యక్రమానికి ఎంఈఓ ప్రభుదాసు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు భవిష్యత్‌లో మంచి పౌరులుగా తీర్చిదిద్దడానికి సాంఘిక శాస్త్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సోషల్ స్టడీస్ ఫోరం బాధ్యులు నాగరాజు, శ్రీకాంత్, యాదబాబు, నరేశ్, రాజేశం, విఠల్, మదన్ మోహన్, రవి, యాదగిరి, ఉమ, సువర్ణ, రజిత, అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.